క్లుప్తంగా

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ



ట్రాక్టరులోకి మొక్కలను చేర్చిన దృశ్యం

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 34 మంది రైతులకు 3,252 మామిడి, నిమ్మ, కొబ్బెర, సపోటా వంటి పండ్ల మొక్కల నుఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రతాప్ పంపిణీ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుపై అవగాహన పెరగడంతో మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు ముందుకు వచ్చారన్నారు. వారి కోసం రాజమండ్రి ప్రాంతం నుంచి మొక్కలను తెప్పించి అందజేశామని ఆయన తెలిపారు.

పండ్ల తోటల సాగు రైతులకు లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

ఉయ్యాలవాడ : సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు ద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చునని ఏపీఓ రవిప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి ఇప్పటి వరకు 3,662 కొబ్బరి మొక్కలు వచ్చాయన్నారు. వీటిని 62 ఎకరాల్లో నాటేందుకు గుంతలు తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆసక్తి గల రైతులు ముందుకు వస్తే పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

162 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బొమ్మలసత్రం: గుట్టుగా లారీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా నంద్యాల మండలం వెంకటేశ్వరాపురం గ్రామశివారులో తాలూకా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. కర్నూలు జిల్లా ఉసేనాపురం గ్రామానికి చెందిన చాంద్ బాషా 162 బస్తాల రేషన్ బియ్యాన్ని సేకరించి నంద్యాల శివారు ప్రాంతంలో నిల్వ ఉంచాడు. అదే జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి లారీని అద్దెకు తీసుకుని డ్రైవర్ విజయరాజు సహకారంతో బుధవారం రాత్రి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా వెంకటేశ్వరాపురం వద్ద తాలూకా పోలీసులు పట్టుకున్నారు. అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించి లారీని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

రైతులతో సమావేశం

గోస్పాడు: రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులతో యాళ్లూరులో బుధవారం రెవెన్యూ అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, డిప్యూటీ తహసీల్దార్లు విజయశేఖర్, మన్సూర్ హుస్సేన్ మాట్లాడుతూ గోస్పాడు నుంచి శిరివెళ్ల వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని విస్తరణ చేసేందుకు సర్వే చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా గోస్పాడులో ఏడుగురు రైతులకు సంబంధించిన 72సెంట్లు, యాళ్లూరులో 48మందికి చెందిన 12.09 ఎకరాల భూమి రహదారి విస్తరణ పనులకు అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ పొలాలకు సంబంధించి ధరలు ఎలా ఉన్నాయని స్వయంగా రైతులను అడిగి తెలుసుకుంటున్నామన్నారు.

అవయవదాన మోటివేషన్ కో ఆర్డినేటర్‌గా ఆనంద్ గురూజీ



నియామక పత్రం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అవయవదాన మోటివేషన్ కో ఆర్డినేటర్‌గా ప్రముఖ యోగా గురువు ఆనంద్ గురూజీని ఎన్నుకున్నారు. బుధవారం ఆయన కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా నియామకం పత్రం అందుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు. చనిపోయిన అవయవదాతకు, కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేస్తుందన్నారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పట్టణం దాకా తనవంతుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గోవిందరెడ్డి, దస్తగిరి, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ..భవిష్యత్తుకు నిచ్చెన

నేషనల్ కేడెట్ క్రాప్స్ (ఎన్‌సీసీ).. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందిస్తోంది. అవసరమైతే దేశ భద్రతకు ఉపయోగపడేలా సిద్ధం చేస్తుంది. పిల్లలు చదువుల్లోనే కాదు.. మిగతా అంశాల్లోనూ రాణించేలా తర్ఫీదు ఇచ్చి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈఏడాది జిల్లాలో 3 వేల మంది విద్యార్థుల ఎంపికే లక్ష్యంగా కసరత్తు ప్రారంభమైంది. – నంద్యాల(న్యూటౌన్)



ఎన్‌సీసీ విద్యార్థులకు గౌరవ వందనంపై శిక్షణ



ఫైరింగ్‌పై శిక్షణ ఇస్తున్న కమాండర్ (ఫైల్)

- ఈ ఏడాది జిల్లాలో 3వేల మంది విద్యార్థుల ఎంపికకు కసరత్తు
- ప్రారంభమైన ప్రక్రియ
- హైస్కూల్, కళాశాల స్థాయిలో ఎంపికలు
- విద్యార్థులకు వివిధ అంశాల్లో రెండేళ్లు శిక్షణ

జిల్లాలో ఇటీవల స్పోర్ట్స్ డే జరిగింది. ఆరోజు నంద్యాల కేఎస్ఎం పురపాలక ఉన్నత పాఠశాల, ఎన్జీజీవోస్ కాలనీలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్, గురురాజ, గుడ్‌షెప్పర్డ్, దీబగుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్, ఆళ్లగడ్డ ఎద్దుల పాపయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈర్నపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్‌సీసీ నిర్వహించేందుకు నేషనల్ క్యాడెట్ క్రాప్స్ డైరెక్టరేట్ ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పాఠశాలలు/కళాశాలల్లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించారు. ఎన్‌సీసీ నిర్వహణకు సంబంధించిన అనుమతుల సాధనకు ఇక్కడ పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ కమాండర్ చైతన్య రెడ్డి ముఖ్య పాత్ర పోషించారు.

ఈ ఏడాది 3వేల మంది లక్ష్యం

వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 2024–25 వ సంవత్సరంలో జిల్లాలో 3వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేయనున్నారు. ఇందుకు జిల్లాలోని 24 ప్రభుత్వ పాఠశాలలు, 8 కళాశాలలను గుర్తించారు. వాటిలో చదువుతున్న విద్యార్థులనే శిక్షణకు ఎంపిక చేస్తారు. ఇటీవలే 8,9వతరగతి చదవుతున్న 50 మంది పాఠశాల విద్యార్థులను రన్నింగ్, పుషప్స్, సిట్ అప్స్ పోటీలు నిర్వహించి ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ కమాండర్ చైతన్య రెడ్డి తెలిపారు.

రెండేళ్ల శిక్షణ...

ఎన్‌సీసీ కోర్సుకు పాఠశాల స్థాయిలో రెండేళ్ల పాటు శిక్షణ ఉంటుంది. మొదటి ఏడాది పాఠశాల స్థాయిలో, రెండో ఏడాది పాఠశాల స్థాయితో పాటు వివిధ ట్రైనింగ్ క్యాంపులకు హాజరు కావడం ఆర్మీలో నిర్దేశించిన డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్ సంబంధించిన అంశాల్లో శిక్షణ పొందాలి. అనంతరం 375 మార్కులకు మూడు గంటల వ్యవధిలో రాత పరీక్ష, 125 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటాయి. పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్ ఇస్తారు. వారి వారి సామర్థ్యాలను బట్టి వేరు వేరు గ్రేడ్లు కేటాయిస్తారు. వీటి ద్వారా తదుపరి ఉన్నత చదవులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం లభిస్తుంది.

“విద్యార్థులకు వరం



ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి, మానసిక, శారీరక దారుఢ్యం పెంపొందుతాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటి వరకు పురపాలక పాఠశాలల్లో ఎన్‌సీసీ నిర్వహించలేదు. మొదటి సారి కేఎస్ఎం పాఠశాలల, హైస్కూళ్ల, కళాశాలల్లో ఎన్‌సీసీ నిర్వహణకు డైరెక్టరేట్ ఆమోదిందించి.

– చైతన్యరెడ్డి, ఎన్‌సీసీ కమాండర్, నంద్యాల

విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుంది



ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది. క్రమశిక్షణ నేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు దారి చూపుతుంది. టీచర్, రైల్వే, పోలీస్, ఆర్మీ, బ్యాంక్, ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాల భర్తీ సమయంలో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. గత రెండేళ్లుగా మా పాఠశాలలో 50 మంది విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నాం.

–రవికుమార్, పీఈటీ, నంద్యాల

గ్రామాభివృద్ధిలో మీ పాత్ర కీలకం

- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో డీఎల్‌పీఓ రాంబాబు
- పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ముగిసిన మూడు రోజుల శిక్షణ



దొర్నిపాడులో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

ఉయ్యాలవాడ: గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని నంద్యాల డీఎల్‌పీఓ రాంబాబు అన్నారు. సర్పంచ్‌లు వారి విధులు, బాధ్యతలు తెలుసుకున్నప్పుడే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. స్థానిక మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌పీఓ పాల్గొని మాట్లాడారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని ప్రతి గ్రామంలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్త సంపద షెడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని, సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి వర్మి కంపోస్టు ఎరువుగా తయారు చేయాలన్నారు. వాటిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ మహింద్రారెడ్డి, ఎంసీఓ కోఆర్డినేటర్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అధికారాలు చాలా గొప్పవి

దొర్నిపాడు:గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాలు చాల గొప్పవని కావునా కార్యదర్శులు, సర్పంచులు తప్పని సరిగా వాటిపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. బుధవారం శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల ద్వారా సంపదను సృష్టించుకోవాలన్నారు. అలాగే వీధిలైట్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్ని స్తంభాలు, ఎన్ని బల్బులు ఉన్నాయో రికార్డు చేసుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపుల, సామాజిక ప్రదేశాల్లో చెట్లను నాటించాలన్నారు. పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, పారిశుధ్య, ఘన, ద్రవ పదార్థాల నిర్వహణ, తాగునీరు, వీధిదీపాల వాటిపై అవగాహన కల్పించారు. రికార్డులు, నివేదికల తయారీ జనన, మరణాలు మరియు వివాహాల రిజిస్ట్రేషన్లను విధిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సీఆర్‌పీ బాలఆంజనేయులు పాల్గొన్నారు.

గోస్పాడు: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మూడురోజులపాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీఓ నాగఅనసూయ మాట్లాడుతూ వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టం పై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల పరిపాలనపై చేపట్టిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. మొదటి రోజు సర్పంచుల విధులు, బాధ్యత లపై అవగాహన, రెండవ రోజు టి.లింగందిన్నెలోని చెత్త సంపద కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించడం వంటివి చేశారు. చివరి రోజు బుధవారం చెత్త సంపద కేంద్రాలు, ఎల్ఈడీ బల్బుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళిక వంటి వాటికి సంబంధించి టీఓటీలు పాములేటి, షాహి నూర్, ఓబులేసు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ పాల్గొని గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక భూమిక పోషించాలన్నారు.

చాగలమర్రి: మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్యక్షతన జరిగిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో డీపీఆర్‌సీ జిల్లా రిసోర్స్ పర్సన్ దస్తగిరి బాషా, శిక్షకులు రాజశేఖర్, ఆదినారాయణ, స్వర్ణకుమార్ పాల్గొని మాట్లాడారు.

శ్రీశైలంలో ద్విశతావధానం ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన డా.బులుసు అపర్ణ వారి ద్విశతావధానం ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై అవధాన కవితా నీరాజనం పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఐదు రోజుల పాటు జరుగనుంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ద్విశతావధాన కార్యక్రమం నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధులైన 60 మంది కవిపండితులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ భక్తి సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రసిద్ధులైన కవిపండితులు, అవధానులు, రచయితలు పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. డోన్‌కు చెందిన గండ్లూరి దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ వల్ల సామాన్యులకు కూడా తెలుగు సాహిత్య గొప్పతనంపై అవగాహన కలుగుతుందన్నారు. చివరిగా డా.బులుసు అపర్ణ ద్విశతావధానం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డా.పేరి రవికుమార్ సభాసంధానకర్తగా వ్యవహరించారు హైదరాబాద్‌కు చెందిన సురంభి శంకరశర్మ అప్రస్తుత ప్రసంగం చేశారు.



వరి నాట్లు వేస్తున్న మహిళలు

వరి నాట్లు షురూ

కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల కింద ఖరీఫ్ వరి నాట్లు మొదలయ్యాయి. శిరివెళ్ల మండలంలో ప్రతి ఏటా 6,543 హెక్టార్ల వరకు వరి సాగవుతుంది. కేసీ కెనాల్ కింద కోటపాడు, వీరారెడ్డిపల్లె, కామినేనిపల్లె, శిరివెళ్ల, వెంకటాపురం, యర్రగుంట్ల, వనికినిదిన్నెలో, తెలుగు గంగ కింద గోవిందపల్లె, చెన్నూరు, ఇసుకపల్లె, మోత్కలపల్లె, బోయలకుంట్ల, గంగవరం, గుండంపాడు గ్రామాల్లో నాట్లు వేస్తారు. ప్రస్తుతం ఈ పనులు ప్రారంభం కావడంతో బిహార్ నుంచి కూలీలను రప్పించారు. వీరు చాలా వేగంగా నాట్లు వేస్తారని రైతులు చెబుతున్నారు.

-శిరివెళ్ల



ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు



నారు తీస్తున్న బిహారీలు

రుధిరంతో సమరయోధులకు నివాళి

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన చిత్రకారుడు కోటేష్ రుధిరంతో 240 మంది స్వాతంత్ర సమరయోధుల చిత్రాలను గీసి నివాళులర్పించారు. ఏ3 డ్రాయింగ్ షీట్‌పై 5గంటల సమయంలో వాటిని గీశారు. ఎందరో వీరుల త్యాగ ఫలమే నేటి స్వాతంత్ర్యమని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన యోధులను భరతమాత చూస్తున్నట్లు చిత్రీకరించినట్లు కోటేష్ తెలిపారు.

–నంద్యాల(అర్బన్)



మార్కెట్ గేట్, సైకిల్ స్టాండ్‌లకు 22న వేలం

నంద్యాల(సిటీ): పట్టణంలోని మార్కెట్ గేట్, కూరగాయల మార్కెట్‌లోని సైకిల్ స్టాండ్‌ల నిర్వహణకు సంబంధించి 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 22వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలానికి మూడు రోజులు ముందు మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సాల్వెన్సీ సర్టిఫికెట్, ఇతర ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు.

'కమిటీ కుర్రాళ్లు' టీం సందడి

నంద్యాల(అర్బన్): కమిటీ కుర్రాళ్ల సినిమా టీం బుధవారం సాయంత్రం పట్టణంలోని సంగీత్ థియేటర్‌లో సందడి చేసింది. ఈ సినిమాకు సినీ నటుడు నాగబాబు కుమార్తె నిహారిక నిర్మాతగా వ్యవహరించారు. సినిమా విజయవంతం కావడంతో టీం సభ్యులతో కలిసి ఆమె థియేటర్‌ను సందర్శించి అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ జీవోలను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీవో నంబర్లు 117, 128లను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. దీనిపై వారు బుధవారం పట్టణంలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పని సర్దుబాటు ద్వారా కాకుండా నెలవారి పదోన్నతులు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియాలను కొనసాగించాలన్నారు. సీబీఎస్ఈ బోర్డుకు అనుసంధానం చేసిన పాఠశాలను తిరిగి వెనక్కు తీసుకోవాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ స్థానంలో తిరిగి స్టేట్ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. యూనియన్ నాయకులు భా స్కరరెడ్డి, రాజ్‌కుమార్, దస్తగిరిబాషా, వీరేశ్వరరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



ఆళ్లగడ్డలో 78 స్వాతంత్ర్య దినోత్సవ ఆకృతిలో విద్యార్థులు

ఆళ్లగడ్డ: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆజాదీకా అమృత మహోత్సవం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీబీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్ బాషా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు, త్యాగధనుల గాథలు, స్వాతంత్ర్య సమరయోధులు తదితర అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరు తమ నివాస గృహాలపై జాతీయజెండా ఆవిష్కరించుకుని దేశభక్తిని చాటాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చే సిన 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఆకృతి ఆకట్టుకుంది

జాతీయ జెండాతో ..

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నారాయణ కళాశాల విద్యార్థులు జాతీయ జెండాతో తిరంగ్ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ శోభ హోటల్ నుంచిడి ప్రారంభమై శ్రీనివాసనగర్, సంజీవనగర్, మున్సిపల్ ఆఫీసు, పద్మావతినగర్ మీదుగా కొనసాగింది. బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, నాయకులు కశెట్టి చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, ఉపేంద్రారెడ్డి, ప్రసాదరెడ్డి, బాలముని, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్లలో బుధవారం నంద్యాల పోస్టల్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణరావు విద్యార్థులకు జాతీయ పతాకాలను అందజేశారు. శాఖ ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. 10 ఏళ్ల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి ఖాతా తెరుస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఎక్కువ వడ్డీ వస్తుందన్నారు. అనంతరంలో గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె పోస్ట్ బ్రాంచ్ మాస్టర్లు ప్రదీప్, రంగస్వామి, వెంకటేశ్వర్లు, మురళీ, టీచర్లు పాల్గొన్నారు.